సాక్షి
రంగారెడ్డి
శనివారం । 21 । జనవరి । 2023



రైతన్న సంక్షేమానికి ప్రాధాన్యం

సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. 8లో▸

హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యదర్శిగా మల్లేశ్

కందుకూరు: తెలంగాణ హ్యూమన్‌రైట్స్ జిల్లా కార్యదర్శిగా దెబ్బడగూడకు చెందిన నీలం మల్లేశ్ నియమితులయ్యారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు శుక్రవారం అతనికి నియామక పత్రం అందించారు. మానవ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని మల్లేశ్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి జంగారెడ్డి, వెంకటేశ్వర్లుగుప్తా పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ గౌస్

ఇబ్రహీంపట్నంరూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన మహ్మద్‌గౌస్ నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డికి మహ్మద్‌గౌస్ కృతజ్ఞతలు తెలిపారు.

'డెక్కన్'లో టెన్షన్

శుక్రవారం సాయంత్రానికీ లభించని ఆ ముగ్గురి ఆచూకీ



భవనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం



జునైద్



జహీర్

వసీం

- భవనం బయట ఆర్తిగా ఎదురుచూస్తున్న కుటుంబీకులు
- మంటలు, పొగ తగ్గినప్పటికీ భరించలేని స్థాయిలో వేడి
- లోపలికి ప్రవేశించ లేకపోతున్న అగ్నిమాపక బృందాలు
- డ్రోన్ల సహాయంతో కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్
- భవనం కూల్చివేతకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ
- పరిశీలించి వెళ్లిన వరంగల్ నిట్‌కు చెందిన కమిటీ



వైద్య సేవల్ని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్‌లో ఉన్న డెక్కన్ కార్పొరేట్ అగ్నిప్రమాదంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ దుర్ఘటనలో గల్లంతైన ముగ్గురి ఆచూకీ శుక్రవారం కూడా లభించలేదు. భవనంలోకి అడుగుపెట్టడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో విక్టిమ్ లోకేషన్ కెమెరాతో (వీఎల్‌సీ) కూడిన డ్రోన్ల సాయంతో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. రాధా ఆర్కేడ్‌లో గల్లంతైన డెక్కన్ కార్పొరేట్ ఉద్యోగులు జునైద్, వశీం, జహీర్ కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాలని పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు శుక్రవారం ఉదయం ఉపక్రమించారు. వీరి సెల్‌ఫోన్ల లాస్ట్ లోకేషన్స్ గురువారం ఉదయం భవనం వద్దే ఉండగా...ఆ తర్వాత స్విచ్ఛాఫ్ అయ్యాయి. మరోపక్క ప్రమాదానికి కారణాలు విశ్లేషించడానికి క్లూస్‌టీమ్‌ను లోపలకు పంపాలని భావించారు. అయితే మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ దట్టమైన పొగ, భరించలేని వేడి ప్రతికూలంగా మారాయి. వీటి కారణంగా నేరుగా, లేడర్ ద్వారా ప్రయత్నించినా బృందాలు భవనంలోకి అడుగుపెట్టే పరిస్థితి కనిపించలేదు.

స్పష్టత లేదు

ఈ నేపథ్యంలోనే రెండో అంతస్తులో భవనం వెనుక వైపు రెండు చోట్ల మృతదేహాలు ఉన్నట్లు ఆనవాళ్లను శుక్రవారం సాయంత్రం గుర్తించారు. అయితే ఇవి స్పష్టంగా కనిపించకపోవడంతో ఔనా? కాదా? అనేది స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. దీంతో డ్రోన్ కెమెరా చిత్రీకరించిన వీడియోను ఇంప్రొవైజేషన్ విధానంలో విశ్లేషించడానికి ల్యాబ్‌కు పంపించారు. మొదటి అంతస్తులో కొంత వరకు లోపలికి వెళ్లిన డ్రోన్ అక్కడ మెట్ల మార్గం, శ్లాబ్ కూలి ఉన్నట్లు గుర్తించింది. భవనం మొత్తం శిథిలాలు, కాలిపోయిన వస్తువులు ఉండటంతో పాటు బూడిద సుమారు రెండు అడుగుల మేర పేరుకుపోయినట్లు గుర్తించారు. పది గంటలకు పైగా మంటల్లో ఉన్న ఈ ఆరంతస్తుల భవనం స్ట్రక్చరల్ స్టెబిలిటీని నిర్ధారించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. దీంతో వరంగల్ నిట్ నిపుణుల బృందంతో కలిసి పరిశీలించారు. నిట్ డైరెక్టర్ రమణ రావు, జీహెచ్‌ఎంసీ అధికారులు క్రేన్ సహాయంతో భవనం పై అంతస్తుల వరకు వెళ్లి పరిశీలించి మంటల్లో కాలిపోయిన కొన్ని శిథిలాలను సేకరించారు. భవనం పూర్తిగా బలహీనంగా మారిందని దీన్ని పూర్తిగా విశ్లేషించిన తర్వాత మాత్రమే పూర్తి వివరాలు చెప్పగలుగుతామని రమణరావు అన్నారు.



సహాయక చర్యల్లో డీఆర్‌ఎఫ్ బృందం

డ్రోన్ల సాయంతో..



లోపలికి వెళ్లలేక వెనక్కు వచ్చిన టీమ్స్ డ్రోన్ కెమెరాల సాయం తీసుకోవాలని స్పష్టం చేశాయి. దీంతో అధికారులు ఓ ప్రైవేట్ సంస్థను సంప్రదించి వీఎల్‌సీతో కూడిన డ్రోన్లను రప్పించారు. వేడి కారణంగా ఈ డ్రోన్లు సైతం లోపలకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించారు. భవనం ముందు భాగంతో పాటు నాలుగు వైపుల నుంచి డ్రోన్ ఎగురవేసి అనువైన, ఖాళీగా ఉన్న భాగాల నుంచి లోపలి ప్రాంతాన్ని పరిశీలించారు.

బయటే బస్తీల జనం..

ఈ భవనాన్ని ఆనుకుని ఉన్న కాచిబోలిలో సుమారు 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్తీలో చాలా ఇళ్లకు శుక్రవారం కూడా తాళాలు కనిపించాయి. భవనం వెనుక ఉన్న ఉత్తమ్ టవర్స్‌లో కిమ్స్ ఆస్పత్రి నర్సింగ్ హాస్టల్ ఉంది. ఇక్కడ నుంచి నర్సులను ఖాళీ చేయించారు. ఈ భవనాన్ని కూల్చిన తర్వాతే చుట్టుపక్కల వారికి అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు. మరోపక్క ఈ భవనం కూల్చివేత పనులు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారని తెలిసింది. శుక్రవారం సాయంత్రం దీన్ని పరిశీలించిన ఆ సంస్థ బృందం కూల్చివేత పూర్తి చేయడానికి మూడు–నాలుగు రోజులు పడుతుందని అభిప్రాయపడింది. గల్లంతైన వారు గుజరాత్ నుంచి వలసవచ్చిన వాళ్లు కావడంతో శుక్రవారం ఉదయానికి వారి కుటుంబీకులు నగరానికి చేరుకున్నారు. తమ వారి కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్న వీరికి రెండు మృతదేహాలు కనిపించాయనే వార్త శరాఘాతమైంది. అవి ఎవరివో, కనిపించని మూడో వ్యక్తి ఎక్కడ ఉన్నాడో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వసీం సోదరుడు ఇమ్రాన్, జునైద్ సోదరుడు ఆసిఫ్ రోజంతా భవనం ముందే గడిపారు. చీకటి పడటంతో శుక్రవారం రాత్రి సెర్చ్ ఆపరేషన్ ఆపేసిన అధికారులు శనివారం మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించారు. అగ్నిప్రమాదం తీరు తెన్నులు, భవనం లోపలి పరిస్థితులను గమనించిన ఓ పోలీసు అధికారి 'ఆ ముగ్గురూ బతికే అవకాశాలు లేవు. ఇన్ని గంటల మంటలు, ఇంత వేడి, ఫైర్ ఇంజన్లు చల్లిన నీళ్లు..ఇవన్నీ పరిశీలిస్తుంటే వారి ఎముకలు దొరికే అవకాశమూ తక్కువే' అని వ్యాఖ్యానించారు.

న్యూస్‌రీల్

ఘనంగా దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తూరు: జేపీదర్గా ఉర్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం దీపారాధన ఘట్టం ముగిసింది. స్థానికులతో పాటు హైదరాబాద్, ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు దర్గా ఆవరణలో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా దర్శనం కోసం ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి

తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యాం



షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణలో రాధేశ్యాం తదితరులు

షాద్‌నగర్: దేశంలో ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం మెరుగైన విద్య, వైద్యం అందించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యాం అన్నారు. తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బస్టాండ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో విద్య, వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి పదిశాతం, వైద్య రంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాలని అన్నారు. తద్వారా దేశంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు వీలుంటుందన్నారు. వైద్య రంగానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కావాల్సిన సదుపాయాలు కల్పించి పేదలకు మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణకు పాటుపడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. కేంద్రం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరారు. ప్రజల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకే సంతకాల సేకరణ చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జనార్దన్, నాయకులు నర్సింలు, కురుమయ్య, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

మీర్‌పేట: విద్యార్థులు చట్టాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.శ్రీదేవి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'చట్టాలు–పరిరక్షణ'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో చూసి అనుకరించి ఎంతోమంది బాలనేరస్తులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేసినా ఎవరూ చూడటం లేదని అనుకోవద్దని, మీ చుట్టూ నిఘా కళ్లు ఉంటాయన్నారు. పోలీసు వ్యవస్థ, షీటీం, సీసీ కెమెరాలు పనిచేస్తూనే ఉంటాయని.. నేరం చేసిన వారికి కఠిన శిక్షలు తప్పవన్నారు. ఏదైనా ఆటంకాలు, ప్రమాదం ఉంటే బాలికలు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ఆమె సూచించారు. అనంతరం జిల్లా శిశు సంక్షేమ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శ్యామలాదేవి మాట్లాడుతూ.. మహిళలపై వివక్ష తగ్గాలని, పురుషుల నిష్పత్తితో సమానంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరళారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండోరోజు 10,321 మందికి పరీక్షలు

నేడు, రేపు సెలవు

- సోమవారం నుంచి యథావిధిగా 'కంటి వెలుగు'



షాద్‌నగర్‌రూరల్: ఎలికట్టలో శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కంటి వెలుగు రెండోరోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 10,321 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 80 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 2,259 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేశారు. మరో 2,128 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు సిఫార్సు చేశారు. వీరికి నెల రోజుల్లో కంటి అద్దాలు అందజేయనున్నారు. శని, ఆదివారాల్లో కంటి వెలుగు కార్యక్రమానికి సెలవు ప్రకటించారు. సోమవారం నుంచి యథావిధిగా ఆయా శిబిరాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ప్రకటించారు.

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం

షాద్‌నగర్‌రూరల్: మానవ శరీరంలోని అన్ని అవయవాలకన్నా నేత్రాలు ఎంతో ప్రధానమైనవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మితో కలిసి పరిశీలించారు. నిత్యం ఎంత మందికి పరీక్షలు నిర్వహిస్తున్నారు.. పరీక్షలు చేసుకున్న వారిలో ఎంతమందికి అద్దాలు అందజేశారు.. పరీక్షలు చేసుకుంటున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా అనే వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. కంటి చూపును కోల్పోతే జీవితం అంధకారంగా మారుతుందని అన్నారు. అంధత్వ నివారణకోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆప్తమాలజిస్ట్ ఆనంద్, డాక్టర్ ఆనంద్‌నాయక్, ఏఎన్‌ఎం సుజాత, అశ్విని, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఆస్పత్రిలో వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు కేసీఆర్ కిట్లను అదజేశారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, వైద్యులు స్రవంతి, అమృతజోసెఫ్, జేమ్స్, అంజిల, అర్జున్‌నాయక్, రాము, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, శ్రీరామ, ఫార్మాసిస్టు ఉదయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రాజు పాల్గొన్నారు.

కంటి సమస్యలతో బాధపడొద్దనే ..

నందిగామ: సమాజంలోని ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడొద్దనే ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర రావు అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో, ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, డాక్టర్లు తులసి, భరత్, అమృత, సూపర్‌వైజర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



సాగర్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ.. ఆర్థికస్థోమత లేక ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతో ఉన్నత చదువులు చదువుదామనుకునే విద్యార్థుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని లేదంటే ప్రగతిభవన్ గేట్లు బద్దలు కొడతామని హెచ్చరించారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బలవంతపు ఫీజుల వసూళ్లు మానుకోవాలన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేసే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, సెన్సార్‌బోర్డు మాజీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుష్పాల శాంతికుమార్, చేవెళ్ల మహేందర్, పగడాల శ్రీశైలం, శేఖర్‌రెడ్డి, ముత్యాల అశోక్, సత్యనారాయణ, దయానంద్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభ కళాశాలల్లో(సీఓఈ) ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిలుకూరు కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు అర్హులన్నారు. విద్యార్థులకు ఉచిత వసతి, శిక్షణ సామగ్రి అందిస్తారని చెప్పారు. ప్రవేశ పరీక్షకు ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు సాధారణ ఇంటర్ బోధనతో పాటు ప్రతిభావంతులైన, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తారన్నారు. ప్రతి సంవత్సరం ఎంతో మంది పేద విద్యార్థులు ఐఐటీ, ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డైరీ ఆవిష్కరణ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన సంవత్సర డైరీ–2023ని శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి నాగభూషణం, కార్యవర్గ సభ్యులు జయమ్మ, స్వరూప, అశోక్‌కుమార్, భిక్షపతి, మహబూబ్‌ఖాన్, చందు, జ్యోతి, సంధ్య, రఘు గౌడ్, జగదీష్, గాయత్రి, హైదర్ష్ అలీ, నాగమణి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శం
- మంత్రి సబితారెడ్డి
- అట్టహాసంగా మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం



మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులతో మంత్రి సబితారెడ్డి

శంకర్‌పల్లి: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మణి గార్డెన్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. నూతన చైర్మన్‌గా పాపారావు, వైస్ చైర్మన్‌గా కురుమ వెంకటేశ్, డైరెక్టర్ల చేత మంత్రి సబితారెడ్డి ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రమాణ స్వీకారం చేయించారు. బీడీఎల్ చౌరస్తా నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి ఎడ్లబండిపై నుంచి అభివాదం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాంధవుడని, ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో శంకర్‌పల్లి మండలం రూపురేఖలు మారాయని తెలిపారు. రైతు బంధు ప్రారంభం నాటి నుంచి చేవెళ్ల నియోజకవర్గంలో రూ. 855కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. రైతు బీమా పథకం కింద రూ.53కోట్లకుపైగా అందించామని చెప్పారు. అనంతరం సింగాపురంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత విజయలక్ష్మి, ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్ అరవింద్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవిందర్‌గౌడ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గుడిమల్కాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కావలి గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్ ఖన్నా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎడ్ల బండిపై మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9666572244

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

యువతి అదృశ్యం



అరుణ (ఫైల్)

చేవెళ్ల: నర్సరీలో పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరులో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ హయ్యూమ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలూరు గ్రామానికి చెందిన బండారి పద్మ, పద్మారావుల కుమార్తె అరుణ(28) గ్రామంలోని నర్సరీలో రోజువారి కూలీగా పనులు చేస్తోంది. నర్సరీలో పనికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన యువతి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాధికారం కోసం పోరాడుదాం

- కుమ్మరుల ఆర్థికాభివృద్ధిని విస్మరించిన సర్కార్
- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్
- దేవునిపడకల్‌లో శాలివాహన క్యాలెండర్ ఆవిష్కరణ

తలకొండపల్లి: రాజ్యాధికారంతోనే కుమ్మరుల బతుకులు బాగుపడతాయని కుమ్మరి సంఘం (శాలివాహన) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ అన్నారు. అందరు కలిసి కట్టుగా రాజ్యాధికారం కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవుని పడకల్లో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దయానంద్ మాట్లాడుతూ కుమ్మరుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ప్రగతికి తోడ్పాటు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమ్మరులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి, తదితర రంగాల్లో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబలైజేషన్ పేరిట ప్రపంచం కుగ్రామమైనందున కుల వృత్తులు మట్టిలో కలిసి పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రూ. వెయ్యి కోట్లు కేటాయించి కుమ్మరుల ఆర్థికాభివృద్ధికి చేయూతనందించాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్యాంక్ రుణాలు అందించి స్వయం ఉపాధికి సహకారమందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రాజలింగం, ప్రచార కార్యదర్శి వీరయ్య, నడికుడి అశోక్, జిల్లా అధ్యక్షులు మోహన్ కుమార్, సంగారెడ్డి వెంకన్న, యూత్ అధ్యక్షుడు గణేష్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, బాలకృష్ణ, మాజీ సర్పంచ్ శంకర్, బాలరాజ్, తిరుపతి, నాగేష్, తిరుపతి, దశరథం, యాదగిరి, యాదయ్య, కమార్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దయానంద్, సంఘం నాయకులు

కార్మికుల సంక్షేమాన్ని

విస్మరిస్తున్న కేంద్రం

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

షాద్‌నగర్‌రూరల్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు ఆరోపించారు. భవన నిర్మాణాలకు సంబంధించిన కొత్త రేట్లతో కూడిన బోర్డును శుక్రవారం పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రామ్మోహన్‌రావు హాజరై మాట్లాడుతూ పోరాటాలు చేపట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం విస్మరిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ఇవ్వాల్సిన చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కార్మికశాఖ చొరవ తీసుకొని పెండింగ్‌లో ఉన్న యూనియన్‌ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్మాణ రంగంలో కూలీల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని, కూలీలందరికీ గుర్తింపు కార్డులను అందజేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ఇస్తామని చెప్పిన బైక్‌లను కార్మికశాఖ నేటి వరకు అందజేయలేదన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డులో సభ్యత్వం తీసుకున్న కూలీలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. పాలసీదారు సహజ మరణం పొందితే రూ.లక్షా 30వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6లక్షలు పొందవచ్చని అన్నారు. ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి వివాహ నజరానా కింద రూ.30వేలు వస్తాయని అన్నారు. ప్రసవ కానుకగా రూ.30వేల చొప్పున రెండు ప్రసవాలకు అందజేస్తారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రాములు, నియోజకవర్గ అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి భీమయ్య, కోశాధికారి గోపాల్‌నాయక్, రాములు, నర్సింహారెడ్డి, కృష్ణయ్య, శ్యామ్, మహేశ్, యాదగిరి, యాదమ్మ, మోతీ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే ముఖ్యం

సమస్యల పరిష్కారానికి కృషి

- డయల్ యువర్ డీఎంలో డిపో మేనేజర్ ఉష



ఫోన్‌ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న డీఎం ఉష

షాద్‌నగర్ రూరల్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష అన్నారు. షాద్‌నగర్ డివిజన్ పరిధిలో ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు డీఎం ఉషకు ఫోన్‌ద్వారా తమ సమస్యలను వివరించారు. ప్రయాణికుల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ డీఎం సమాధానాలు ఇచ్చారు. అనంతరం డిపో మేనేజర్ ఉష మాట్లాడుతూ ప్రయాణికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పని చేస్తోందని అన్నారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సంస్థను ప్రగతిపథంలో నడిపించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తోడ్పాటును అందించాలని కోరారు. ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు. ప్రయాణికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు తరలించే బాధ్యత ఆర్టీసీ ఉద్యోగులపై ఉందని అన్నారు.

పాఠశాలకు రంగులు వేస్తుండగా..

- విద్యుదాఘాతంతో కూలీకి తీవ్ర గాయాలు
- దేవునిఎర్రవల్లిలో ఘటన

చేవెళ్ల: మండలంలోని దేవుని ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేస్తున్న కూలీ కరెంట్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఒకే ఆవరణలో ఉన్నాయి. దాతల సహాయంతో పాఠశాలకు రంగులు వేయించే పనులు చేపట్టారు. శుక్రవారం బీహార్‌కు చెందిన కూలీ రాహుల్ భవన సమీపంలోనే ఉన్న 11కేవీ విద్యుత్‌వైర్లను గమనించకుండా రంగులు వేస్తుండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతన్ని చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారని స్థానిక సర్పంచ్ మాణిక్యరెడ్డి తెలిపారు.

జూనియర్, చరణ్‌లను గుర్తించని కేంద్రం: ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: తెలుగు చిత్రసీమ రంగంలో ఇద్దరు ప్రముఖ నటులను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం లేదని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. నగర శివారులోని ఓ ఫిల్మ్‌సిటీలో శుక్రవారం జరిగిన పార్లమెంటరీ కమిటీ బోర్డు (ఐటీ అండ్ టెక్నాలజీ) సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని గ్లోబల్ లెవల్‌గా, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణిలు గోల్డెన్ అవార్డుకు ఎంపికైనప్పటికీ తమ నటనతో ఉత్తమ ప్రతిభ చూపించిన జూనియర్ ఎన్టీఆర్, రామచరణ్‌లను కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.